
# కన్నుల పండువగా..చిన్న తెరేసమ్మ పండుగ



## చీఫ్ గెస్ట్‌గా ఖమ్మం మేత్రాసన పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సగిలి ప్రకాష్





**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

నీ వలే నీ ఎదుటి వారిని ప్రేమించాలని క్రీస్తు యేసు చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరూ నడవాలనీ, కష్టాలను చిరునవ్వుతో ఎదుర్కొని దేవుని మార్గంలో పయనించాలని ఆర్‌సీఎం ఖమ్మం మేత్రాసన పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సగిలి ప్రకాష్ తండ్రి గారు తెలిపారు. చింతకాని మండలం రామకృష్ణాపురం పునీత చిన్న తెరేసమ్మ దేవాలయం పండుగ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌సీఎం ఖమ్మం మేత్రాసన పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సగిలి ప్రకాష్ తండ్రి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక దివ్య బలిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ సగిలి ప్రకాష్ గారు మాట్లాడుతూ...ప్రతీ ఒక్కరూ ఆద్యాత్మికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసి మెలసి దేవుని బాటలో నడవాలని అన్నారు. పునీత చిన్న తెరేసమ్మ దేవాలయ పండుగను విజయవంతం చేయడంతో సంఘం చేసిన కృషిని అభినందించారు. ఈ వేడుకకు ఖమ్మం మేత్రాసనం నుండి సుమారు 25మంది గురువులు, 20మందికి పైగా కన్యాస్త్రీలు హాజరయ్యారు. ఖమ్మం మేత్రాసన పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సగిలి ప్రకాష్ తండ్రి గారు పండుగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి, ప్రార్థనలు చేశారు.

### పునీత చిన్న తెరేసమ్మ జీవితం ఆదర్శం..

పునీత చిన్న తెరేసమ్మ గారు యూరోపు ఖండమునందుగల ఫ్రాన్సు దేశములో జన్మించారని సగిలి ప్రకాష్ తండ్రి గారు తెలిపారు. వైశాల్యంలో ఎంతో చిన్నదయినా, ప్రపంచ చరిత్రలో మరియు క్రైస్తవ లోకంలో తరతరములనుండి తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న దేశం ఫ్రాన్స్ దేశమని ఆయన తెలిపారు. తొలుత లూర్దుమాత వెలసింది ఈ దేశంలోనే అని ప్రత్యేకంగా చెప్పనసవరం లేదు కదా అని వివరించారు. పునీత చిన్న తెరేసమ్మ కాలిడిన ధన్య నగరమే అలెన్సో అని సగిలి ప్రకాష్ గారు తెలిపారు. ఇది అంత పెద్ద నగరం కాదు. అయినా ఆ కాలంలో ఫ్రాన్స్‌లో అందరికీ సుపరిచితమైన స్థలమిదని ఆయన తెలిపారు. ఎందుకంటే,'అలెన్సో' లేసు వ్యాపారానికి ప్రసిద్ధి చెందిందని అన్నారు. ఇక్కడనుండే ఇతర నగరాలకు ఎగుమతి చేసేవారు. ఫలితంగా అదో ధనవంతమైన నగరమే అని చెప్పాలి. తెరేసమ్మ అలెన్సోలో జన్మిస్తే, లిస్యూనగరి తెరేసమ్మ అని ఎందుకు పిలుస్తారు? అన్న సందేహం రావడం సహజం. తెరేస అలెన్సోలో జన్మించినా, ఆమె జీవించిన 24 సంవత్సరాలలో ఎక్కువ సంవత్సరాలు లిస్యూ నగరంలోనే గడిపారు. ఆమె మరణించింది కూడా ఈ లిస్యూలోనే. అందుకే లిస్యూనగరి తెరేసమ్మ అని పిలుస్తారని గుర్తు చేశారు. తెరేసమ్మ గారి తండ్రిపేరు లూయిస్ మార్టిన్. ఆయన 1823 ఆగష్టు 22న బోర్డెయూ అనే పట్టణంలో జన్మించారు. ఆయన తండ్రి ఫ్రాన్సు దేశపు సైన్యంలో ఒక ఉన్నతాధికారి. వృత్తి నిమిత్తమై పలు స్థలాలలో నివసించవలసి వచ్చేదని అన్నారు. నూతన యుగంలో కాలిడిన మనకు పునీత తెరేసమ్మ ఇచ్చే మధుర సందేశం చాలా అవసరమని అన్నారు. తెరేసమ్మ పడిన కష్టాలు, అనుభవాలు మానవాళికి ఆదర్శప్రాయమని అన్నారు. ఒక సందర్భంగా చిన్న తెరేసమ్మ మాట్లాడుతూ.. 'నేను జీవించిందల్లా కేవలం 24 సంవత్సరాలు. వాటిలో సుమారు 10 సంవత్సరాలు గేటు బయట కాలు పెట్టలేదు. మఠంలో చేరి కఠినమైన తపోః కార్యములు గానీ ఉపవాసములు గానీ చేయలేదు. నేను చేసిందల్లా ప్రార్థనా సమయంలో నిద్రపోవటం, చూసిన ప్రతి వారికి ఓ చిరునవ్వు నివ్వటం, వారే విధంగానైనా నన్ను నిందిస్తే, మౌనం పాటించడం... ఇంతే. వీటన్నింటిని మించి 'ప్రభువు ఎంతో ప్రేమగల తండ్రి' అని గ్రహించాను. మరి అంతటి ప్రేమ కలవాడైతే నాకెందుకు భయం? అందుకని నిర్భయంగా నిశ్చింతగా నా భారమంతా ఆయనపై మోపాను. 'నన్ను నడిపించు' అని చేయిచాచాను. నేను నడవలేని స్థితిలో నన్ను ఎత్తుకొనమని చెప్పాను. నీ ఇష్టం వచ్చినట్లు చేయి అని పూర్తి విశ్వాసంతో, నమ్మికతో నన్ను నేను సంపూర్ణంగా సమర్పించుకున్నాను. నా బలహీనతలు నీకు తెలుసు. నేను అన్నింటిలోను పూర్తి ప్రేమను ఉంచి చేసేదాన్ని అరి తెరేసమ్మ తనను తాను దేవునికి సమర్పించుకుని ఘనకీర్తిని సొంతం చేసుకున్నారని శ్రీశ్రీశ్రీ సగిలి ప్రకాష్ గారు వివరించారు. దివ్య బలిపూజ అనంతరం ఆత్మీయ విందును ఆరగించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ సగిలి ప్రకాష్ గారు సంఘ సభ్యులకు సంతోషకరమైన పండుగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేవుని ప్రేమ మరియు ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ మీతో ఉండాలని ఆశీర్వదించారు. ఈ ప్రత్యేక పండుగ రోజున, దేవుడు మీ జీవితాన్ని శాంతి, ఆనందం మరియు ఆనందంతో నింపాలని ప్రార్థించారు. ఈ పండుగ దినపు ఆశీర్వాదాలు మిమ్మల్ని దేవునికి దగ్గర చేసి, మీ హృదయాన్ని ఆనందంతో నింపుగాక అని ఆశీర్వదించారు. ప్రతీ ఒక్కరి హృదయం ప్రభువు యొక్క శాంతి మరియు ఆనందంతో నిండి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అందరికీ శుభాకాంక్షలు తెలిపారు

